**Press Release**

# సచివాలయం విశ్వశ్రేణిలో ఉండాలి

## ఫోస్టర్ కంపెనీ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు సూచన

## సీఎం, గవర్నర్ నివాస భవనాలపై రికార్డో బోఫిల్ ప్రజెంటేషన్

అమరావతి, మార్చి 8: ఆంధ్రప్రదేశ్ నూతన సచివాలయం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా ఉండాలని, అటువంటి తరహా ఆకృతులను రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాజధానిలో వివిధ కట్టడాల నమూనాలను ఉండవల్లిలో గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. ముందుగా నార్మన్ ఫోస్టర్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి సచివాలయ నిర్మాణ ఆకృతులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. సూక్ష్మ స్థాయిలో సైతం ప్రతి నిర్మాణం ఆకర్షణీయంగా, ప్రయోజనకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

### సీఎం, గవర్నర్ నివాస భవనాల నమూనాల ప్రదర్శన

స్పెయిన్ కు చెందిన రికార్డో బోఫిల్ కంపెనీ ముఖ్యమంత్రి నివాసం, క్యాంప్ ఆఫీసు, రాజ్ భవన్, దర్బారు హాలు నమూనాలను ప్రదర్శించగా ప్రపంచంలో అత్యుత్తమంగా ఉండేలా మరిన్ని మెరుగులు దిద్దాలన్నారు. భవనాల ఇంటీరియర్ డిజైన్ల ప్రత్యేకతను వారు ముఖ్యమంత్రి కి వివరించారు. నిర్మాణ ఆకృతుల రంగులను పరిశీలించారు. త్వరగా పూర్తిచేసి మళ్లీ తగిన మార్పులతో రావాలని సూచించారు.

### వైల్డర్ నెస్ పార్కు త్వరగా పనులు ప్రారంభించాలి

అమరావతిలో కేటాయించిన 20 ఎకరాల్లో వైల్డర్‌నెస్ పార్కును త్వరగా ఏర్పాటు చేయాలని ప్రగతి గ్రీన్ మిడోస్ అండ్ రిసార్ట్స్ సంస్థను ముఖ్యమంత్రి కోరారు. రిసార్ట్సు, రకరకాల పుష్పవనాలు, మూలికా వనాల మధ్య ఆహ్లాదభరితంగా ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

వాకింగ్, సైకిల్ ట్రాకులు, రెస్టారెంటు, దట్టమైన అరణ్యాన్ని స్ఫురింపజేసే ఫారెస్టు, వినోదక్రీడలు ప్రత్యేక ఆకర్షణలుగా ఉంటాయని ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. స్పాలో హైడ్రో థెరపీ, మెడిటేషన్, మూలికా వైద్యం లాంటి సదుపాయాలుంటాయని చెప్పారు. ఎన్టీఆర్ అన్నక్యాంటీన్ల నిర్మాణంపై ఎల్ అండ్ టి ప్రదర్శించిన కట్టడ నమూనాలు అంత ఆకర్షణీయంగా లేవని ముఖ్యమంత్రి అన్నారు. సమావేశంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, మౌలిక సదుపాయాల విభాగాల ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, ముఖ్యమంత్రి కార్యదర్శి ఎ.వి. రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.